

సాక్షి గుంటూరు

శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 526.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,598, ఎడమకు 6,022 విడుదల చేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 2953 క్యూసెక్కులు విడుదల చేశారు.



న్యాయమూర్తికి ఆహ్వానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను కలిసి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఈఓ అందజేశారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

గృహ ప్రవేశ సంబరం

- ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ నవరత్న పథకాలు
- ప్రజాపక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి
- పేరేచర్లలో పండుగలాగా జగనన్న ఇళ్లు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి

పేదల సొంతింటి కల నెరవేరింది. దసరా పండుగ ముందుగానే వచ్చింది. లబ్ధిదారులతో పేరేచర్ల కైలాసగిరిలోని వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్–3 కళకళలాడింది. మామిడి తోరణాలతో స్వాగతం పలికారు. ఇళ్లను అందంగా అలంకరించుకున్నారు.

మేడికొండూరు: ఎన్ని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా ఏ ప్రభుత్వం చేయలేని బృహత్తర కార్యం, పేదలకు సొంతింటి కల సాకారం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే నెరవేరిందని శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. మండలంలోని పేరేచర్ల కైలాసగిరి వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్–3లో గృహ ప్రవేశాలను గురువారం వేడుకగా నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోటలో వర్చువల్‌గా ప్రారంభించిన తర్వాత పేరేచర్లలో నాయకులు, అధికారుల సమక్షంలో లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశాలు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 52 నెలలకాలంలో 35 రకాల ప్రజాప్రయోజనకరమైన సంక్షేమ పథకాలు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి, ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టోని 90శాతం అమలుచేసినట్లు చెప్పారు. గత ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రజలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రత్యేక కార్యాచరణతో అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ రాజ్యాధికారం నేరుగా ప్రజల వద్దకు గ్రామసచివాలయాల వ్యవస్థ ద్వారా తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా మాట్లాడుతూ జిల్లాలో 30వేల గృహాలు పూర్తిచేసినట్లు తెలిపారు. కులమతాలకతీతంగా, రాజకీయపార్టీల తారతమ్యాలకు తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించారని అన్నారు. వైఎస్సార్ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ కైలాసగిరి కొండ పక్కనే ఏర్పాటుచేసిన జగనన్న లే అవుట్–3లో మొత్తం 188 ఇళ్లు నిర్మించి లబ్ధిదారులతో గృహ ప్రవేశం చేయించడం సంతోషంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచి మరోమారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, ట్రైనీ కలెక్టర్ కె స్వాతి, డీసీసీబీ చైర్మన్ లాలుపురం రాము, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న, హౌసింగ్ ఈఈ ఎ శంకరరావు, హౌసింగ్ ఏఈ దివ్య, తహసీల్దార్ శ్రీనివాసశర్మ, ఎంపీడీఓ ప్రభాకరరావు, ఏపీఎం విజయభారతి, పేరేచర్ల గ్రామ సర్పంచ్ దేవరకొండ రాజ్‌కుమార్, మంగళగిరిపాడు గ్రామ సర్పంచ్ షేక్ రబ్బాని, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ టి.వంశీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బాజి, సొసైటీ చైర్మన్‌లు షేక్ గాలిబ్, పాములపాటి జయరావు, ముత్యాల బాలస్వామి, కోక అర్జునరావు, అబ్బాస్, తూమాటి మురళి, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గృహాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా

న్యూస్‌రీల్

దసరా ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు



అమరావతి: పవిత్ర శైవక్షేత్రం అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో ఈనెల 15వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపినాథశర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంవత్సరం దసరా ఉత్సవాలలో తొమ్మిది రోజుల పాటు చండీహోమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 20న మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేసి బాలబాలికలకు ఉచితంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు. 22న రాత్రి 7గంటలకు చండీ కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. 23న శమీవృక్షం కింద ప్రత్యేక పీఠంపై పూజ నిర్వహిస్తామన్నారు. ఉదయం, సాయంత్రం భక్తులకు ఉచిత ప్రసాదాలను వినియోగం చేస్తామన్నారు. భక్తులందరూ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

91.88 శాతం ఈ-కేవైసీ పూర్తి



కొరిటిపాడు(గుంటూరు): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్‌లో నమోదు చేసిన పంటలను ధ్రువీకరిస్తూ రైతులతో ఈ–కేవైసీ చేయించే ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. శుక్రవారం చివరి రోజు కావడంతో రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జీలు, మండల వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం సాయంత్రానికి ఈ–కేవైసీ 91.88 శాతం పూర్తయింది. 1,00,117 మంది రైతులు 2,15,683.48 ఎకరాల్లో సాగుచేసిన పంటలకు ఈ–కేవైసీ చేశారు. ఈ–క్రాప్‌లో 2,35,710.78 ఎకరాల్లో సాగు చేసిన పంటలను నమోదుచేశారు. ఇంకా 20,027.30 ఎకరాల్లోని పంటలకు ఈ–కేవైసీ చేయించాల్సి ఉంది. సర్వర్ పనిచేస్తున్నంత వరకు రైతులతో ఈ–కేవైసీ చేయించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు 'సాక్షి'కి తెలిపారు. ఈ–కేవైసీ లేకపోతే ఈ–క్రాప్‌కు ప్రామాణికత ఉండదు. రైతులు ఆర్‌బీకేల్లో బయోమెట్రిక్ వేయడం ద్వారా లేదా ఓటీపీ ద్వారా ఈ–కేవైసీ చేయించుకోవచ్చని సూచించారు.

ఐటీఐలో విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



తెనాలి: స్థానిక జగ్గడిగుంటపాలెంలోగల ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడ్లలో కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు స్నాతకోత్సవం జరిపి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న 'కౌశల్ దీక్షంత్ సమురః' అనే కార్యక్రమం ద్వారా ఈ సర్టిఫికెట్ల బహూకరణ చేసినట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ రావి చిన్నవెంకటేశ్వర్లు తెలిపారు. జగ్గడిగుంటపాలెం సర్పంచ్ కంభం బాలాజీ ముఖ్యఅతిథిగా హాజరైన సభలో ట్రైనింగ్ అధికారులు ఎం.రామారావు, సీహెచ్ లక్ష్మణ్, ఆఫీస్ సూపరింటెండెంట్ కె.శ్యామ్‌సుందర్, ఆఫీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యార్డులో 27,892 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 25,302 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 27,892 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.12,000 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,280 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్ రాజీనామా

కమిషనర్‌కు పత్రం అందజేత



తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కరణాల వల్ల తాను చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. తమపై అనేక తప్పుడు ఆరోపణలు రావటం బాధాకరమన్నారు. వాటిలో ఎలాంటి వాస్తవం లేదని చెప్పారు. తమకు ఇప్పటి వరకు సహకరించిన ఎమ్మెల్యే శివకుమార్‌కు, మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు, తన సహచర కౌన్సిలర్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కమిషనర్ ఎం జస్వంతరావుకు రాజీనామా పత్రం అందజేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ రియాజ్ ఖాన్ పాల్గొన్నారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

పాతగుంటూరు: విజయదశమి పురస్కరించుకుని ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు జిల్లాలోని ఐదు డిపోల నుంచి సాధారణ బస్సులతో పాటు 94 ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.రవికాంత్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18వ తేదీన గుంటూరు నుంచి హైదరాబాద్‌కు 4 బస్సులు, 19వ తేదీన హైదరాబాద్‌కు 8 బస్సులు, చెన్నై, బెంగళూరు, తిరుపతికి 3 సర్వీసులు, 20వ తేదీన హైదరాబాద్‌కు 24 బస్సులు, చెన్నై, బెంగుళూరు, తిరుపతికి 6 బస్సులు, 21వ తేదీన హైదరాబాద్‌కు 20 బస్సులు, చెన్నై, తిరుపతికి 2 బస్సులు, 22వ తేదీన హైదరాబాద్‌కు 12 బస్సులు, 23వ తేదీన హైదరాబాద్‌కు 15 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రవికాంత్ తెలిపారు.

ట్రాక్టర్ ప్రమాద బాధితులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



చెక్కులు అందజేసి బాధిత కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- ప్రమాదంలో బాధిత కుటుంబాలకు రూ.34.25 లక్షల చెక్కుల అందజేత

గుంటూరురూరల్: ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల ప్రత్తిపాడు మండలం కొండెపాడు గ్రామానికి చెందిన ట్రాక్టర్ ప్రమాదంలో అశువులుబాసిన, గాయపడిన బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండెపాడు గ్రామానికి చెందిన ప్రజలు పొన్నూరు మండలం జూపూడి గ్రామంలో జరిగే శుభకార్యక్రమానికి ట్రాక్టర్‌లో ప్రయాణిస్తూ సుమారు 32 మంది గ్రామస్తులు వట్టిచెరుకూరు గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడి ఏడుగురు మహిళలు చనిపోయిన విషయం తెలిసిందే. మిగిలిన వారికి గాయాలవ్వటంతో చనిపోయిన వారి కుటుంబానికి రూ.ఐదు లక్షలు, తీవ్ర క్షతగాత్రుల కుటుంబాలకు లక్ష రూపాయలు, స్వల్ప గాయాలైన కుటుంబాలకు రూ.25 వేలు చొప్పున జగనన్న ఆర్థిక సాయం ప్రకటించారన్నారు. బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మానసిక వైద్య నిపుణుల సదస్సులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు శరత్‌చంద్ర, నరసింహారావు, లోకేశ్వరరెడ్డి, తదితరులు

గుంటూరు మెడికల్ : దక్షిణ భారత మానసిక వైద్యుల సంఘం 56వ వార్షిక విజ్ఞాన సదస్సులు శుక్రవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు మూడు రోజులపాటు గుంటూరులో నిర్వహిస్తున్నట్లు మానసిక వైద్య నిపుణుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఇవటూరి శరత్ చంద్ర చెప్పారు. గుంటూరు ఇన్నర్‌రింగ్‌రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం 9 గంటలకు సౌత్‌జోన్ కాన్ఫరెన్స్ ప్రారంభమవుతోందని తెలిపారు. గురువారం గుంటూరులో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన మానసిక వైద్య నిపుణులు సదస్సుకు వస్తున్నట్లు డాక్టర్ శరత్‌చంద్ర తెలిపారు. మానసిక చికిత్స విధానంలో నూతన ఆవిష్కరణలపై అమెరికా, ఆస్ట్రేలియాకు చెందిన సీనియర్ మానసిక వైద్య నిపుణులు ప్రసంగిస్తారన్నారు. పీజీ వైద్య విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు, యూజీ వైద్య విద్యార్థులకు క్విజ్‌పోటీలు ఉంటాయని తెలిపారు. మానసిక వైద్య నిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఐ.వి.ఎల్.నరసింహారావు, సౌత్‌జోన్ సెక్రటరీ డాక్టర్ పబ్బతి లోకేశ్వరరెడ్డి, సౌత్‌జోన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఉదయ్‌కుమార్, ఏషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి.ప్రసాదరావు, సీనియర్ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.వి.రమణరావు పాల్గొన్నారు.

జ్యోతిసురేఖకు అభినందనలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆసియా క్రీడల్లో మూడు స్వర్ణాలు సాధించిన క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ గురువారం ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను కలెక్టర్ అభినందించారు. ఆసియా క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన జ్యోతిసురేఖ ఆర్చరీ విభాగంలో మూడు స్వర్ణాలు సాధించి చరిత్ర సృష్టించిందని కలెక్టర్ కొనియాడారు. యువ క్రీడాకారులు జ్యోతిసురేఖను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిగా ఉమాదేవి



నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిగా(ప్రాజెక్ట్ డైరెక్టర్) ఎం ఉమాదేవి గురువారం విధుల్లో చేరారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా అధికారిగా పనిచేస్తున్న బి మనోరంజనిని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ(డబ్ల్యూడీ అండ్ సీడబ్ల్యూ) కమిషనర్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీ చేయడంతో ఆమె స్థానంలో డబ్ల్యూడీ అండ్ సీడబ్ల్యూ కమిషనర్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఉమాదేవిని జిల్లా పీడీగా నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ ఎం జానకీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్‌ఐ మెయిన్స్ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



నగరంపాలెం: గుంటూరు నగరంలో ఈనెల 14, 15 తేదీల్లో జరగనున్న ఎస్‌ఐ మెయిన్స్ పరీక్ష కేంద్రాలను గురువారం జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ పరిశీలించారు. ఈ మేరకు టీజేపీఎస్, ఏసీ కళాశాల, తదితర పరీక్ష కేంద్రాలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాశాలల యాజమాన్యాలకు, పోలీసు అధికారులకు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద మహిళ పోలీసులు విధుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఇంటర్నెట్ కేంద్రాలు, జిరాక్స్ షాపులను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎస్పీ వెంట తూర్పు ఏఎస్పీ ఎన్.శరేక్, పశ్చిమ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌బీ ఇన్‌చార్జి సీఐ బాలసుబ్రహ్మణ్యం, కొత్తపేట పీఎస్ సీఐ అన్వర్‌బాషా ఉన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3000, గరిష్ట ధర రూ.4200, మోడల్ ధర రూ.3500 వరకు పలికింది.

స.హ. చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్



మాట్లాడుతున్న సమాచార కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్

బాపట్ల: సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలు అధికార యంత్రాంగం జవాబుదారీతనాన్ని రాబట్టాలని రాష్ట్ర సమాచార కమిషనర్ పి శామ్యూల్ జోనాథన్ పిలుపునిచ్చారు. గురువారం స.హ.చట్ట ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యాన గురువారం వ్యవసాయ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు కళాశాల ఇన్‌చార్జి ఏడీ కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కమిషనర్ మాట్లాడుతూ స.హ.చట్టం ద్వారా పాలనలో పారదర్శకత సిద్ధిస్తుందని అన్నారు. స.హ.చట్టం సామాన్యుడిని సాధికారిగా చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించే అధికారం కూడా ప్రజలకు ఉందని వివరించారు. ఫోరం కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు మాట్లాడుతూ స.హ.చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని అన్నారు. ఈ చట్టం అటకెక్కకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనే ఉందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఆచార్య లాల్ అహ్మద్, కోటేశ్వరరావు, బాలాజిరెడ్డి, డేవిడ్ రాజు, రాజారావు, చిత్రకారుడు జీవీ ప్రసన్నాంజనేయులు, అర్జున్, గురజాల శ్రీనివాసరావు, శేఖర్, దేవవరం విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ద్విచక్రవాహనదారుడు, కారు డ్రైవర్ దుర్మరణం




మృతి చెందిన అబ్దుల్ బాషా, సమీర్‌శర్మ

మార్టూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటన మార్టూరు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగింది. ఎస్‌ఐ కమలాకర్ వివరాల మేరకు.. చిలకలూరిపేట నుంచి మార్టూరు వచ్చే సర్వీసు రోడ్డులో చిలకలూరిపేట మండలం పోతవరం గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్‌బాషా (50) తన కారులో చిలకలూరిపేట వైపు వెళ్తున్నాడు. స్థానిక హరిప్రియ గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్న అసోం రాష్ట్రానికి చెందిన సమీర్‌శర్మ (25) ద్విచక్ర వాహనంపై అదే మార్గంలో మార్టూరు వైపు వస్తున్నాడు. హెచ్‌పీ పెట్రోల్ బంకు ఎదురు ఆటోను తప్పించే క్రమంలో బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. సమీర్ శర్మ బైకుతో సహా గాలిలో ఎగిరి ఎదురుగా వస్తున్న కారుపై పడ్డాడు. ప్రమాద తీవ్రతకు కారు అద్దం పగిలి అబ్దుల్ బాషాకు తలలో తీవ్ర గాయమైంది. ఎగిరి రోడ్డుపై పడిన సమీర్ శర్మకు రెండు చేతులు, రెండు కాళ్లు విరిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు బల్లికురవ 108 సిబ్బంది సాయంతో క్షతగాత్రులు ఇరువురిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అబ్దుల్ బాషాను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు అబ్దుల్ బాషాకు భార్య ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. వైద్యుల సూచనపై సమీర్ శర్మను 108 సిబ్బంది గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి గుంటూరు సమీపంలో అతను కూడా మృతి చెందాడు. సమీర్ శర్మ మృతదేహాన్ని 108 సిబ్బంది గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై కమలాకర్ మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని అబ్దుల్‌బాషా మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలోనే ఉంచారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 2.30 కోట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు, మొక్కుబడులను గురువారం మహా మండపంలో లెక్కించారు. మహామండపం ఆరో అంతస్తులో జరిగిన హుండీ లెక్కింపులో 16 రోజులకు రూ.2,30,88,508 నగదుతో పాటు 671 గ్రాముల బంగారం, 5.615 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈఓ కెఎస్.రామారావు తెలిపారు. నగదుతో పాటు విదేశీ కరెన్సీ భారీగా లభ్యమైంది. 431 యూఎస్‌ఏ డాలర్లు, 55 కెనడా డాలర్లు, 57 సింగపూర్ డాలర్లు, యూఏఈకి చెందిన 135 దిర్హమ్స్, కువైట్‌కు చెందిన 17.5 దినార్లు, ఖతార్‌కు చెందిన 23 దిర్హమ్స్ లభ్యమయ్యాయి. ఇ–హుండీ ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రూ.80,103 విరాళాలు చెల్లించారని ఆలయ అధికారులు తెలిపారు. కానుకల లెక్కింపును ఈఓ కె.ఎస్.రామారావు, పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, కట్టా సత్తెయ్య, బచ్చు మాధవీకృష్ణ, దేవదాయ శాఖ అధికారులు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

5-కె రన్ విజేత మణికంఠ



గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాజు అండ్ రవి 5-కె రన్ విజేతగా డి.మణికంఠ నిలవగా వరుసగా ద్వితీయ తృతీయ స్థానాల్లో ఎ.మనోజ్, వై.సతీష్‌లు నిలిచారు. గురువారం ఉదయం స్థానిక బీఆర్ స్టేడియంలో 5-కె రన్‌ను రాజకీయ విశ్లేషకులు చందు సాంబశివరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో డీఎస్‌ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ విదేశాల్లో స్థిరపడినప్పటికీ స్థానికంగా ఈపోటీలు నిర్వహించిన మంతెన రాజు, నరాలశెట్టి రవిలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్ సంఘం చైర్మన్ జి.శేషయ్య, ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్,వై.కిషోర్, క్రీడా కోచ్‌లు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేసారు.

ముగిసిన జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-23, సీనియర్ మెన్, ఉమెన్ ఫెన్సింగ్ పోటీలను డీఎస్‌ఏ చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. గురువారం ఉదయం స్థానిక బీఆర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలకు సుమారు 100 క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం పోటీల నిర్వాహకుడు అశోక్ మాట్లాడుతూ ఎంపిక చేసిన జట్టును ఈ నెల 14, 15 తేదీల్లో కాకినాడలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు.

భక్తుల భద్రతకు పెద్ద పీట

- దసరా ఉత్సవాలకు 3 వేల మంది పోలీసులతో బందోబస్తు
- చోరీల నియంత్రణకు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా
- మోడల్ గెస్ట్ హౌస్‌లో కంట్రోల్ రూంలో 24 గంటలూ పనిచేసేలా సిబ్బంది నియామకం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: దసరా ఉత్సవాల్లో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. ఈ సారి ఉత్సవాలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. భక్తులకు సౌకర్యాల కల్పన, భద్రతకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు జరిగే దసరా ఉత్సవాలకు మూడు వేల మంది పోలీసు అధికారులు, సిబ్బందిని మోహరిస్తున్నామని వివరించారు. సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా వీలైనంత తక్కువ సమయంలో దుర్గమ్మ దర్శనమయ్యేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లపై 'సాక్షి' ప్రతినిధితో సీపీ టి.కె.రాణా పలు విషయాలు పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

జిల్లాల నుంచి అదనపు సిబ్బంది

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి లక్షల మంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉంది. ఉత్సవాల సాధారణ రోజుల్లో రోజుకు 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉంది. 20వ తేదీ మూలా నక్షత్రం రోజు 1.5 లక్షల నుంచి రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనావేస్తున్నాం. కొండపైన, దిగువన ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, బందోబస్తు విధులకు కమిషనరేట్ పరిధిలోని సిబ్బందితోపాటు జిల్లాల నుంచి అదనంగా సిబ్బందిని రప్పిస్తున్నాం. మూడు షిఫ్టుల్లో సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తారు. ఎక్కువ మందిని ఆలయం, దుర్గాఘాట్, బస్టాండు, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో మోహరిస్తాం. గతంలో వీఐపీలను మోడల్ గెస్ట్‌హౌస్ నుంచి తరలించేవారు. ఈ సారి భవానీ ఘాట్ నుంచి తరలిస్తాం. అంతరాలయంలో భక్తులకు త్వరితగతిన దర్శనమయ్యేలా మహిళా పోలీసులకు శిక్షణ ఇప్పించాం.

రద్దీ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు

భక్తుల రద్దీని తట్టుకొనేందుకు వీలుగా క్యూలైన్లు ఏర్పాట్లు చేస్తున్నాం. కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి, భవానీపురం వైపు నుంచి వచ్చే భక్తులకు కుమ్మరిపాలెం సెంటర్ హెడ్ వాటర్ వర్క్స్ నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేశాం. గతంలో వినాయకుడి గుడి నుంచి మోడల్ గెస్ట్ ఎదురుగా కొండ పక్క నుంచి టోల్‌గేటు మీదుగా ఇంద్రకీలాద్రికి భక్తులు చేరుకొనేలా క్యూలైన్లు ఉండేవి. ఇటీవల కొండ చరియలు విరిపడిన నేపథ్యంలో క్యూలైన్‌లను మోడల్ గెస్ట్ హౌస్ వద్ద ఎడమ వైపు మళ్లించి ఫ్లై ఓవర్ కింద నుంచి ఫుట్ బ్రిడ్జిపైగా ఘాట్ మీదుగా, కుమ్మరిపాలెం క్యూలైన్లను టోల్‌గేట్ నుంచి కుడివైపు మళ్లించి ఫుట్ బ్రిడ్జి నుంచి కొండపైకి చేరుకొనేలా ఏర్పాటు చేశాం. ఇందు కోసం ఈ ఏడాది ప్రత్యేకంగా రెండు ఫుట్ బ్రిడ్జిలను సిద్ధం చేశాం.

దివ్యాంగుల కోసం..

మోడల్ గెస్ట్‌హౌస్ వద్ద దివ్యాంగుల కోసం ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతున్నాం. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా వీఎంసీ కార్యాలయం ఖాళీ స్థలంలో ప్రత్యేక కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేసి, ఇక్కడ 15 వేల మంది వేచి ఉండేలా చర్యలు తీసుకున్నాం. భక్తులకు లడ్డూ ప్రసాదాలు అందుబాటులో ఉండేలా 12 ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. స్నాన ఘాట్ల వద్ద భక్తుల రక్షణ కోసం బార్ కేడ్లు ఏర్పాటు చేస్తున్నాం. అన్ని ఘాట్ల వద్ద ప్రత్యేకంగా సిమ్మర్లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేస్తున్నాం.

నిరంతర నిఘా



మోడల్ గెస్ట్‌హౌస్‌లో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. అక్కడి నుంచి రెవెన్యూ, పోలీస్, మునిసిపల్, దేవదాయ తదితర శాఖల అధికారులు నిరంతరం భక్తులను పర్యవేక్షిస్తారు. ఇక్కడ 24 గంటలూ పనిచేసేలా సిబ్బందికి విధులు కేటాయిస్తాం. నిఘా కోసం ముఖ్యమైన ప్రాంతాల్లో 250లకుపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. దొంగలను కనిపెట్టేలా ప్రత్యేకంగా క్రైం స్పాటర్లను రంగంలోకి దించుతున్నాం. విజయవాడలో ట్రాఫిక్ నియంత్రణ కోసం వివిధ మార్గాల్లో వాహనాలను మళ్లిస్తాం.

– సీపీ టి.కె.రాణా

మెరిట్ లిస్ట్ విడుదల

బాపట్ల అర్బన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సమగ్ర శిక్ష ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న ఐఈఆర్పీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తాత్కాలిక మెరిట్ లిస్ట్, ఎలిజిబులిటీ స్టేటస్‌ను హెచ్‌టీటీపీఎస్://ఏపీఐఈ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాకి సంబంధించి అభ్యంతరాలు, ఫిర్యాదులు 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

మంగళగిరిలో టెంట్ పీకేసిన తెలుగు తమ్ముళ్లు

మంగళగిరి: నియోజకవర్గంలోనే తాను పోటీ చేస్తానని చెప్పుకొంటున్న టీడీపీ కార్యదర్శి లోకేశ్‌కు స్థానిక తెలుగు తమ్ముళ్లు గట్టిఝలక్ ఇచ్చారు. చంద్రబాబు అరెస్ట్ అయిన రోజు నుంచి 33 రోజులుగా రిలే నిరాహార దీక్షలు పేరుతో కాలక్షేపం చేసిన టీడీపీ నేతలు.. ఇక చంద్రబాబుకు ఇప్పట్లో బెయిల్ వచ్చే సూచనలు కనిపించకపోవడంతో నిరాశకు గురై దీక్షల శిబిరాన్ని ఎత్తేశారు. టెంట్లు, కుర్చీలు, స్టేజీ ఖర్చులు తాము భరించలేమంటూ అలా చేతులెత్తేశారు. లోకేశ్ పోటీ చేస్తానన్న మంగళగిరి నియోజకవర్గంలోనే పార్టీ పరిస్థితి ఇలా ఉంటే ఇక మిగిలిన చోట ఎలా ఉంటుందోనని టీడీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.



పాతబస్టాండ్ సెంటర్‌లో టెంట్లు, జెండాలు పీకేయడంతో ఖాళీగా ఉన్న దీక్ష శిబిరం

చిన్నతనం నుంచే క్రీడల్లో రాణించాలి

కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి



మంగళగిరి: విద్యార్థులు చిన్నతనం నుంచే విద్యతో పాటు క్రీడలలోను రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి సూచించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఖో ఖో బాలబాలికల అండర్-14, అండర్-17 క్రీడాకారుల ఎంపిక పోటీలు నగర పరిధిలోని నిడమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్పలతా రెడ్డి మాట్లాడుతూ క్రీడలలో రాణించడం వలన భవిష్యత్‌లో అనేక రంగాలలో ప్రాధాన్యత లభించడంతో ఉన్నత స్థితికి చేరుకునే అవకాశముందన్నారు. కార్యక్రమంలో పీడీలు కె.జోషెఫ్, సి.హెచ్. వెంకటరావు, పి.ఎం.సి. చైర్మన్ బి.రాంబాబు, ఎస్‌జీటి జి.ప్రతాప్‌రెడ్డి, స్కూలు హెచ్‌ఎం ఎస్.వెంకటేశ్వరరావు, పీడీ ఎన్.రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలను వెలికితీయండి

కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్: విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందిస్తే వారికి త్వరగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల్లో వృత్తి నైపుణ్యం శిక్షణను మరింత అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థుల్లో నైపుణ్య శిక్షణ అందించేందుకు వివిధ సంస్కరణలు అవసరమైన పక్షంలో ఒప్పందాలు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులకు డిమాండ్ ఉన్న కోర్సులపై మరింత అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రణయ్, ఉపాధి అధికారి రఘు, సీడ్‌యాప్ ఏడీఎం శివప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

ఉత్తరాఖండ్‌పై 77 పరుగులు తేడాతో హైదరాబాద్ ఘన విజయం

మంగళగిరి: గుంటూరు జిల్లా అమరావతి టౌన్‌షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో గురువారం ప్రారంభమైన తొలి మ్యాచ్‌లో భారీ స్కోర్‌లు నమోదు కాగా హైదరాబాద్ జట్టు పరుగుల వర్షం కురిపించింది. బీసీసీఐ ఆధ్వర్యంలో మినూ మన్కడ్ ట్రోఫీ అండర్-19 తొలి మ్యాచ్‌లో హైదరాబాద్, ఉత్తరాఖండ్ జట్లు తలపడ్డాయి. ఉత్తరాఖండ్ జట్టుపై హైదరాబాద్ జట్టు 77 పరుగులు తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన హైదరాబాద్ జట్టు తొలి ఓవర్ నుంచే పరుగుల వేట కొనసాగించింది. 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 345 పరుగులు భారీ స్కోర్ సాధించింది. జట్టు బ్యాట్స్‌మన్ ఎ.అవినాష్ చెలరేగిపోయాడు. 70 బంతులలో 14 ఫోర్లు, ఎనిమిది సిక్స్‌లతో 128 పరుగులు సాధించాడు. అతనికి తోడుగా ఆరాన్ జార్జి 77 బంతుల్లో ఐదు ఫోర్లతో 60 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మన్ ఎం.ఎస్. కార్తీకేయ 34 బంతులలో ఎనిమిది ఫోర్లు, రెండు సిక్స్‌లతో 55 పరుగులతో నాటౌట్‌గా నిలవడంతో భారీస్కోర్ సాధించారు. ఉత్తరాఖండ్ బౌలర్ ఆషార్ ఖాన్ 10 ఓవర్లలో 47 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీశాడు.అనంతరం 346 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టులో సన్‌స్కార్ రావత్ 74 బంతులలో 11 ఫోర్లు, ఒక సిక్స్‌తో 86 పరుగులు సాధించగా 47.4 ఓవర్లలో 268 పరుగులకు ఆలౌటైంది. దీంతో హైదరాబాద్ జట్టు 77 పరుగులతో ఘన విజయం సాధించింది.



సెంచరీ సాధించిన అవినాష్

15 నుంచి శారదాపీఠంలో శరన్నవరాత్రి మహోత్సవాలు



పాతగుంటూరు: సంపత్‌నగర్‌లో వేంచేసియున్న శ్రీ శృంగేరి శంకరమఠం శ్రీశారదా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు శ్రీశారదా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు వేదపండితులు విష్ణుభొట్ల ఆంజనేయ చయనులు వెల్లడించారు. గురువారం ఆలయంలో విలేకరుల సమావేశంలో ఆయన కార్యక్రమాల వివరాలు తెలిపారు. పోలిశెట్టి శ్రీహరిప్రసాద రావు నిర్వహణలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 14 ఉదయం 6 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం, 15న గణపతి పూజ, కలశ స్థాపనతో ఉత్సవాలు ఆరంభమవుతాయన్నారు. 20న సరస్వతి పూజ, సాయంత్రం వేదసభ, 22న కాత్యాయనీ వ్రతం, 23న చండీహోమం, పూర్ణాహుతి, సాయంత్రం శమిపూజ, 25న సాయంత్రం 7 గంటలకు అమ్మవారి నగర రథోత్సవం జరుగుతాయని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈసందర్భంగా కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. భక్తులు కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్గో బలోపేతానికి సమష్టి కృషి అవసరం

ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి

పాత గుంటూరు: ఆర్టీసీ కార్గో ఆదాయాన్ని పెంచేందుకు ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ ఎ.రాజారెడ్డి సూచించారు. గురువారం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో సెక్షన్‌ను ఆయన సందర్శించారు. అక్కడి పనితీరును పరిశీలించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ కార్గో విభాగంలో ఆదాయం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించిందని తెలిపారు. ఈ కమిటీ రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో పర్యటించి కార్గో ఆదాయాన్ని పెంచేందుకు అధ్యయనం చేసి రిపోర్ట్‌ను ప్రజా రవాణా సంస్థ కమిషనర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం తిక్కన సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ అనేక ఇబ్బందులు ఎదుర్కొందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీ ఉద్యోగులు పడుతున్న కష్టాలను చూసి, నష్టాలలో ఉన్న సంస్థను ఆదుకునేందుకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి సంస్థను ఆదుకున్న విషయాన్ని ఉద్యోగులు మరువరాదన్నారు. వంద సంవత్సరాల వరకు ఆర్టీసీకి ఢోకా లేదన్నారు. అనేక పరిశ్రమలు ఉన్నందున కార్గో ఆదాయం పెరిగేందుకు చాలా అనుకూల పరిస్థితులు ఉన్నాయని వివరించారు. కార్గో ఆదాయం రూ. 1000 కోట్లు లక్ష్యంగా అధికారులు, ఉద్యోగులు సమష్టి కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం. రవికాంత్, డెప్యూటీ సీటీఎం కె.వి.రమణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్గో కేంద్రాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న రాజారెడ్డి

అటవీ భూములు, వన్య ప్రాణుల సంరక్షణపై దృష్టి

పల్నాడు జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రరావు

పిడుగురాళ్ల: అటవీ భూములు, వన్య ప్రాణుల సంరక్షణపై అటవీ శాఖాధికారులు దృష్టి పెట్టాలని పల్నాడు జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.రామచంద్రరావు పేర్కొన్నారు. స్థానిక అటవీ రేంజ్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత కార్యాలయంలోని రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, వన్య ప్రాణి రక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. క్యాలెండర్ ప్రకారం అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని క్షేత్రస్థాయిలో అధికారులను ఆదేశించారు. వన్య ప్రాణుల వేటను అరికట్టాలని, అటవీ ఆక్రమణదారులతో కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. వర్షాభావ పరిస్థితిలు నెలకొని ఉండటం వలన వన్య ప్రాణుల కోసం నీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే సిబ్బంది కోసం గ్రీవెన్స్ నిర్వహించి ప్రతి ఒక్క సిబ్బంది సమస్యలను తెలుసుకొని వారి సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించారు. సిబ్బంది సంక్షేమం కోసం, సౌకర్యార్థంగా విధులు నిర్వహించేందుకు పలు రకాల పరికరాలను కొనుగోలు చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

కోనంకి అటవీ ప్రాంతాన్ని..

మండలంలోని కోనంకి బీట్‌లో ఈ ఆర్థిక సంవత్సరం చేపట్టిన అటవీ అభివృద్ధి పనులను డీఎఫ్ఓ ఎస్.రామచంద్రరావు తనిఖీ చేశారు. అదే విధంగా మాచాయపాలెం బీఎస్ఎస్ ద్వారా నిర్మాణం చేపట్టిన నీటి కుంటలను, ప్లాంటేషన్ అయిన ప్రాంతాలను పరిశీలించారు. ఆయన వెంట పిడుగురాళ్ల డెప్యూటీ రెంజ్ ఆఫీసర్ బీవీఎల్ నాయుడు, బీట్ అధికార్లు షేక్ జానీబాషా, నరసింహారెడ్డి ఉన్నారు.



పిడుగురాళ్లలోని అధికారులతో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా అటవీ శాఖాధికారి ఎస్. రామచంద్రరావు

అడ్రస్ కోసం వెతుకుతూ అనంత లోకాలకు..

యడ్లపాడు: జాతీయ రహదారిపై నిలుపుదల చేసిన లారీని అదేమార్గంలో వస్తున్న మరో వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి మండలంలోని తిమ్మాపురం పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. రాజమండ్రి నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న పొగాకు లోడు లారీ డ్రైవర్, క్లీనర్‌లు తిమ్మాపురం వద్ద ఉన్న క్రీస్తుసంఘం చర్చి వద్ద నివాసితుల్ని అడ్రస్ అడిగేందుకు హైవే పక్కగా లారీని నిలుపుదల చేశారు. స్థానికులు రాజేంద్ర, అతడి ఆరేళ్ల కుమారుడు జాన్‌వెస్లీ ఆగిన లారీ ఎదురుగా లైట్లకింద అడ్రస్ చీటిని చదివి చెబుతున్న క్రమంలో అదే మార్గంలో వచ్చిన కంటైనర్ ఆగి ఉన్న లారీని వెనుకగా ఢీకొట్టింది. దీంతో ముందున్న లారీ కదిలి దాని ఎదురుగా నిలబడి ఉన్న వారిపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఐపంగిడి గ్రామానికి చెందిన పొగాకులోడు లారీ డ్రైవర్ కోమటి కృష్ణారావు(67)కు తీవ్రంగా, డేగల జాన్‌వెస్లీకి, క్లీనర్ నాగరాజుకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108 వాహనం ద్వారా చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ డ్రైవర్ కృష్ణారావు మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.